# స్వయం కల్పితాలు

చీకటి పడుతోంది. ఆకాశం అంచులు ఎర్రగావున్నాయి. "ఈ పిల్లలు ఇంకా ఆటలు మానరు" అని విసుక్కుంటూ లేచి, చాప చుట్టేశాను.

"పదండర్రా పిల్లలూ, ఇళ్ళకి వెళ్ళరా యీరోజు?" అని గట్టిగా కేకేశాను. కాని నామాట వినట్లు ఉయ్యాళ్ళు కిర్రుమంటూనే వున్నాయి. బంతి ఎగురుతూనే వుంది. పుస్తకాలన్నీ తీసుకువెళ్ళి, అలమారులో పెట్టి వచ్చింది నా అసిస్టెంటు వనజ. స్కిప్పింగుత్రాళ్ళు, రింగు, బంతులు పిల్లల దగ్గర్నించి లాక్కోవడం బ్రహ్మాండమైన పని.

బలవంతాన గేట్ విప్పేసి, గదిలోపడేసి తాళం వేసేశాను. రోజూ యిదే వరస. నేను బైటికివెళ్ళి గేటుతాళం చప్పుడుచేసే వరకు ఉయ్యాళ్ళు దిగరు యీ ఆడపిల్లలు. 'పొరబాటున మర్చిపోయినా పోతాను ఒక్కో పిల్లని' అనుకున్నాను.

బైటికివచ్చి పెద్దగేటు గొళ్ళెం చప్పుడు చేశాను. బిలబిలలాడుతూ పరుగెత్తుకొచ్చేశారు పిల్లలు. ఖాళీవుయ్యాలలు అల్లా వూగాయి కాస్సేపు. తాళంవేసి, తాళంచెవి బ్యాగ్‌లో వేసుకునేసరికి బాగా చీకటి పడింది.

చుట్టూ పిల్లలు—'అక్కయ్యా' అంటూ ఏవో ఖబుర్లు చెబుతూ. వీళ్ళ ఉత్సాహం చూస్తే, నేనుకూడా ఒక పదేళ్లు వెనక్కివెళ్ళిపోయినట్లనిపిస్తుంది. నిన్న కాక మొన్న కాదూ నేనూ కోలాటాలు వేసింది?

పది అడుగులు వేశానో లేదో వెనకనుంచి వనజకేక వినిపించింది. "ఆగు అక్కయ్యా," అని నా సహోదరులతోసహా ఆగాము రోడ్డు మధ్య. రొప్పుకొంటూ పరుగెత్తుకొచ్చింది వనజ.

"మా కాంత లోపల వుండిపోయిందేమో అక్కయ్యా. ఆమూల ఉయ్యాల వూగుతోంది యిందాక," అన్నది ఆదుర్దాగా. నా గుండె గతుక్కుమంది. 'అయ్యో' అని ఒక్క ఉదుటున గేటువరకు వెళ్ళాను. గేటు పట్టుకునివుంది కాంత. ఘొల్లుమని ఏడుస్తోంది.

తాళంతీసి, ఎత్తుకున్నాను కాంతని. వెక్కి వెక్కి ఏడుస్తోంది. గౌనంతా తడిసిపోయింది. "ఊరుకో అమ్మా—కాంతా, ఏడు. వూరుకో, బైటికవచ్చేశావుగా మరి. ఊరుకో." సముదాయింపులకి ఆగటంలేదు ఆ పసిపాపదుఃఖం. ఆ ఒంటరితనం, నిస్సహాయత తలచుకుని తలచుకుని ఏడుస్తోంది అనిపించింది.

వనజ చెల్లి చేయిపట్టుకుని తీసుకువెళ్ళింది యింటికి.

మళ్ళీ తాళం వేయబోయి, ఎందుకైనా మంచిదని ఓమాటు లోపలికివెళ్ళి మూలలన్నీ చూసివచ్చాను. నాతోపాటు యీపిల్లమూక!

ఇంటికిచేరేసరికి ఎనిమిది గంటలైంది. అమ్మతో చెప్పాను యిదంతా. "అయ్యో పాపం, మీరంతా వచ్చేస్తే ఏమైపోను ఆ అమ్మాయి?" అన్నది అమ్మ. నిజమేపాపం, నిర్జనం ఆప్రాంతమంతా. ప్లేగ్రౌండుతప్పించి యింకేయిళ్లూ లేవు అక్కడ. ఎత్తుగోడలు, పిలిచినా వినిపించుకునేదిక్కు లేదు. గేటు గట్టిదికూడాను.

★ యం. జ్ఞా

కాంతదీనవదనం, ఆఏడుపు జ్ఞాపకంరాసాగాయి నాకు. భోజనంచేసి పడుకున్నాను- చల్లనిగాలి...

ఉలిక్కిపడి లేచాను ఒకగంటలోనే. గడియారం 11 గంటలు కొడుతోంది. కళ్ళు తెరచి చూశాను. గడియారంక్రింద మేకుకి ప్లేగ్రౌండు తాళంచెవి. నాన్నగారింకా వ్రాసుకుంటూనే వున్నారు.

చిట్టి—ఆ ఐదేళ్ళపిల్ల, ఆ వందుమొద ట్లోనే వుంటోంది. సాయంకాలం 'సీసా' క్రింద పడుకునుంది. మునికిపాట్లు పడుతోంటే కేకలేశాను. ఉయ్యాల ఎక్కింది కాస్సేపు. మళ్ళీ వెళ్ళి అక్కడే పడుకుంది. నిద్రపోలేదుకదా? ఆ 'సీసా' క్రింద చూశాను కాదు మందమతిని.

చటుక్కున మంచంమీద లేచి కూచున్నాను. నా గుండె దడదడ కొట్టుకుంది.

"నాన్నగారూ, చిట్టి తాలూకు వాళ్ళెవరూ రాలేదా మనింటికి?" అన్నాను.

మా నాన్నగారు ఆశ్చర్యపోయినారు. "ఏమిటమ్మా? లేచావేం?" అన్నారు.

"చిట్టికోసం ఎవరూ రాలేదా నాన్నగారూ వెతుక్కుంటూ?" అన్నాను మళ్ళీ.

నాకళ్లముందు, సీసా క్రింద అమాయకంగా నిద్రిస్తున్న చిట్టి రూపమే కనిపిస్తోంది.

"లేదమ్మా! ఏం? వినా వాళ్ళ యిల్లు దగ్గరా, పాపం! అమ్మమ్మగారింటికి వెళ్ళివుంటుంది ఆ పిల్ల. ఎందుకమ్మా అల్లాగ అడుగుతున్నావు?" అన్నారు. కలం మూసేసి నా మంచం దగ్గరికి వచ్చారు.

"పడుకో తల్లీ! అదే ధ్యాసవల్లే ఎల్లాగ? అందరూ ఎవరిళ్లకి వాళ్లు వెళ్ళివుంటారు క్షేమంగా" అన్నారు. కాని నేను పడుకోలేదు. లేచి, హాల్లోకి నడిచి వచ్చాను. నాకు ఏమీ పాలుపోవటం లేదు.

"లేదు నాన్నగారూ, చిట్టి ఆ సీసా క్రిందో, జారుడుబల్ల క్రిందో పడుకునుంటుంది నాన్నగారూ. నిద్రపోతూ వున్నది అప్పుడు. నేను చూడలేదు సరిగా. నల్ల పరికిణీ. కాదు నాన్నగారూ, చీకట్లో కనిపించి వుండదు".


లాంతరు వెలిగించాను. మా నాన్నగారు, అమ్మ నావంక ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"అది కాదమ్మా, ఎందుకా ఖంగారు? ఆ పిల్ల యింటికి వెళ్లక ఏమౌతుంది? నీదంతా చాదస్తం తల్లీ. పడుకో. రోజూ తాళంవేసి రావటం లేదూ?" అన్నది మా అమ్మ.

కానీ నా మనస్సు పరిపరి విధాల పోతోంది. చెప్పులు వేసుకుని లాంతరు తీసుకున్నాను. ఆ గోడలు ఎత్తు. చుట్టూ తాటిచెట్లున్నాయి. చిట్టివంటిని బంగారంకూడా వున్నది. అమ్మో, ఏం కాను ఆపిల్ల! ఆకలితో, భయంతో-ఈ చీకట్లో... నాకు వూపిరాడలేదు.

"పదండి నాన్నగారూ, వాళ్ళ అమ్మమ్మ దగ్గరుందని వాళ్ళ వాళ్ళు అనుకుంటారు.

శ్రీకాఫ్
దగ్గు, ఉబ్బసములకు
దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్&డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30



ఎల్లప్పుడూ మొదటి బహుమానము వానిదే—

వాని మాలు దుస్తులు సాన్ఫొరైజ్‌డ్ లేబిలుగల బట్టతో కుట్టినవే!

వాని వయస్సులో పిల్లలు ఎల్లప్పుడూ చెలాకీగా ఉంటారు. మీ పిల్లవాడు హుషారుగా ఆడుతూ పాడుతూ ఉండడము చూస్తే మీకు ఎంత ఆనందముగా ఉంటుంది! వాని ఆట పాటలలో వాని దుస్తులతో బిగుకు కంగకుండా చూచే బాధ్యత మీదే. దానికి వాని దుస్తులను 'సాన్ఫొరైజ్‌డ్' (Sanforized) ట్రేడు మార్కుగల బట్టతో కుట్టించండి. 'సాన్ఫొరైజ్‌డ్' ట్రేడు మార్కుగల బట్టతో తయారైన దుస్తులు కొలవట్లుగా ఎన్నటికీ కుంగవే కుంగవు.

అది మారయినా, మూడు అరయినా—'సాన్ఫొరైజ్‌డ్' ట్రేడు మార్కుగల బట్టతో కుట్టించిన దుస్తులు కొలవట్లుగా ఎన్నటికీ కుంగవు

లేబిలుమీద 'SANFORIZED'

ఈ గుర్తు ఉన్నదా అని గమనించండి

అలాచేస్తే మీ దుస్తులు కొలవట్లుగా ఎన్నటికీ కుంగవు!

రిజిస్టరు చేయబడిన 'సాన్ఫొరైజ్‌డ్' ట్రేడు మార్కునకు అధికారులైన క్లూయట్, పీబొడి అండ్ కంపెనీ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు. ఎస్. ఎ. లో సంస్థాపితము) వారిచే ప్రచురింపబడినది. ఈ కంపెనీయొక్క కచ్చితమైన ప్రమాణములకు తగినట్లు కుంగకుండా ఉండే బట్టలకుమాత్రమే 'సాన్ఫొరైజ్‌డ్' ట్రేడు మార్కు వేయుటకు అంగీకారము యిస్తాము.

వివరములకు: 'సాన్ఫొరైజ్‌డ్' సర్వీస్. 9కె. పెరిన్ డ్రైవ్. బొంబాయి 1

ACP 4372


# స్వయం కల్పితాలు

ఇంటికి వెళ్ళిపోయిందని అమ్మమ్మ అనుకుంటుంది. ఉపేక్ష చేస్తారు. వాళ్ళకు తెలియదు నాన్నగారూ". నాన్నగారు చెప్పులు వేసుకుని, కర్రతీసుకుని బయలుదేరారు. "భద్రం అమ్మాయి" అని మా అమ్మ గేటు దగ్గర తిన్నెమీద కూర్చుంది.

అర్ధరాత్రి వేళ—సందులో మా అడుగులే ప్రతిధ్వనించాయి. లాంతరు వెలుగుకి, గోడలమీద మానీడలు. నా అడుగుల చప్పుడుకి మిన్నగా నా హృదయం కొట్టుకుంటోంది.

ప్లేగ్రౌండు సమీపించిన కొద్దీ నా చెవులు పసిపిల్ల ఏడుపుకోసం ఎదురుచూశాయి. సన్నగా ఏడుపు, 'అక్కా' అన్న పిలుపు నాకు వినిపించింది.

తలుపుతీశారు మా నాన్నగారు. చిమ్మచీకట్లో ఉయ్యాలలు మౌనంగా, ప్రశాంతంగా వున్నాయి. 'సీసా' అచేతనంగా వుంది. బేడ్మింటన్ కోర్టులో అడుగుజాడ లున్నాయి లోతుగా. చిట్టిమాత్రం లేదు. మా నాన్నగారు జారుడుబల్ల క్రింద తొంగిచూశారు. నాహృదయంలో ఆరాటం తగ్గలేదు. మా నాన్నగారు నిట్టూర్పు విడిచారు గేటు మూసేస్తూ. నాకు కొంచెం నిస్పృహా కలిగినమాట వాస్తవమే.

సందులో చిట్టి అమ్మమ్మగారి యింటి తలుపు తట్టాం. "చిట్టి వచ్చిందాండీ?" అన్న నా ప్రశ్నలో అర్థం స్ఫురించలేదు నాకు. మంచంమీద, దుప్పటిలో చిన్నగా, వెచ్చగా వుంది చిట్టి—నా ఆరాటం అర్థం కాలేదు చిట్టి అమ్మమ్మకి. "ఏమమ్మా, మామూలుగానే ఇంటికి వచ్చేసిందే" అన్నది ఆవిడ ఆశ్చర్యంగా.

మా నాన్నగారు సన్నగా మందలిస్తూండగా యింటికిచేరాము. "నేను చెబుతుంటే విన్నావు కే అమ్మాయి! ఇంత ఇదైతే ఎల్లాగమ్మా" అంటూ మా అమ్మ లాంతరు తగ్గించింది.

ఆనాటి రాత్రి ఎప్పటికోగానీ నిద్ర పట్టలేదు. ఆరాటంతో, ఆతురతతో నిండిన ఆ కాలం—నా మానసిక భావనలు అర్థము కాలేదు ఎవరికీ. అర్థం కావు—పరిపరివిధాల పరుగులెత్తే నా వూహాలు—నాలో నాకే కలిగిన భయాలు—అన్నీ స్వయంకల్పితాలు. కారణరహితాలు.

కానీ—చిట్టి ఆ గ్రౌండులోపల ఏడుస్తూ దీనంగా కనిపిస్తే నా హృదయానికి సంతృప్తి కలిగేదేమో!

ఏమో! ★